క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్, చేడ్వాయి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్సీ దండె విఠల్ సహకారంతో ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించనున్నట్లు కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు చేయూతను అందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన కేసీఆర్ సేవాదళం జిల్లా అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా(తారిక్) ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాదరావు నివాసంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బాలేశ్వర్‌గౌడ్, మునీర్ అహ్మద్, చరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న పోలీసు సంఘం నాయకులు

ఆసిఫాబాద్: పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ శనివారం మృతి చెందిన మడావి ఆనంద్‌రావు కుటుంబ సభ్యులకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాచ్‌మెంట్స్, మంచిర్యాల పోలీస్ మిత్ర అసోసియేషన్ 2012 యూనియన్ సభ్యులు రూ.3 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేశారు. కాగజ్‌నగర్‌లోని మృతుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మొగిలి మల్లేశ్, బైరినేని వెంకటేశ్వర్లు, పంగిడిపల్లి రమేశ్, గంగాధరి దేవేందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న మాస్టర్లు

రెబ్బెన: మంచిర్యాల జిల్లా సోమగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో రెబ్బెన మండలం నంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ చాపిడి కుమార్ ఆదివారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.శ్రేష్ఠ, కె.అక్షిత బంగారు పతకాలు సాధించగా, డి.ప్రణీత, ఐ.హర్షిత వెండి పతకాలు, ఎం.సాయి ప్రసన్న, ఆర్.సోనూ కాంస్య పతకాలు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను గ్రాండ్ మాస్టర్ సదానందం అభినందించారు.

సంఘం అభివృద్ధికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ

కాగజ్‌నగర్ రూరల్: మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దడె విఠల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాపు కులసంఘం అభివృద్ధికి రూ.25 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కలికోట రమణయ్య, గజ్జి రామయ్య, గజ్జెల లక్ష్మణ్, దెబ్బటి జలపతి, తాటి రాంచందర్, తాటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు డప్పు ప్రదర్శనకు సిద్ధం కావాలి

ఇంద్రవెల్లి: హలో మాదిగ.. చలో హైదరాబాద్ నినాదంతో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే డప్పు ప్రదర్శనకు మాదిగలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కాంబ్లే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ముందుగా ముక్త సాల్వే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగలు ఎవరికి వారు సొంతంగా డప్పులు ఏర్పాటు చేసి ప్రదర్శనకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అందరే బాలాజీ, లింగంపల్లి రాజన్న, సూర్యవంశీ మాధవ్ పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులపై ఆసక్తి

- పెరిగిన చలి తీవ్రత
- కొనుగోలు చేసేందుకు మక్కువ

ఆదివారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	ఉష్ణోగ్రతలు
సిర్పూర్(యూ)	6.1
గిన్నేధరి	6.2
తిర్యాణి	7.1
కెరమెరి	8.3
ధనోరా	8.8
వాంకిడి	9.7
కాగజ్‌నగర్	10.1



అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్వెటర్లు

కౌటాల: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తున్నాయి. దీంతో చలి తీవ్ర పెరిగి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు ఉన్ని వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. చలి నుంచి శరీరాన్ని కాపాడుకునేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పిల్లల నుంచి వృద్ధుల వరకు..

చలికాలంలో చిన్న పెద్దా అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ ఉన్ని వస్త్రాలు ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. చెద్దర్లు, స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, హ్యాండ్ గ్లౌజులు, మఫ్లర్లు, సాక్సులు, క్విడ్స్ స్వెట్టర్లు విత్ క్యాప్, కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలకు సంబంధించిన ఉన్ని వస్త్రాలు సరసమైన ధరలకు లభిస్తున్నాయి. వినియోగదారులకు కావాల్సిన రంగుల్లో, ఆకట్టుకునే విధంగా కొనుగోలు చేస్తున్నారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన డిమాండ్

ఇటు హుందాతనం.. అటు వెచ్చదనం.. వెరసి చలి తీవ్రత నుంచి రక్షణ. శీతాకాలం వచ్చిందంటే చాలు వెచ్చగా ఉండేందుకు ఉన్ని వస్త్రాలతో పాటు జర్కిన్స్(జాకెట్)పై దృష్టి సారిస్తున్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలోని మార్కెట్‌లో రూ. 300ల నుంచి రూ. 2000 వరకు లభిస్తున్నాయి.

క్రీమ్‌లపై మక్కువ..

ప్రధానంగా యువత కొత్త ఉత్పత్తులపై మక్కువ ప్రదర్శిస్తుండటంతో వారి అభిరుచికి అనుగుణంగా కంపెనీలు కూడా అదే స్థాయిలో కోల్డ్‌క్రీమ్స్ మార్కెట్‌లోకి వస్తున్నాయి. ముఖము, చేతులపై ఎలాంటి గీతలు (చారలు) పడకుండా పొడిబారిన పడిన చర్మం నున్నగా, నాజుగ్గా ఉండేలా కోల్డ్‌క్రీమ్స్ వినియోగిస్తున్నారు. వివిధ సువాసనలు కలిగిన ఉత్పత్తులు సైతం మార్కెట్‌లో అందుబాటులో ఉండగా పెదవులు, కాళ్లు, చేతులు పగుళ్లు తేలకుండా కోల్డ్‌క్రీమ్స్ చక్కని ఫలితాలను అందిస్తున్నాయి.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఆసిఫాబాద్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. అనంతశ్రీ విభూషిత్ రామానందాచార్య పాదుకదర్శన కార్యక్రమం కరపత్రాలను ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 17న జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో పాదుకదర్శనం నిర్వహించడం జరుగుతుందన్నారు. కలియుగంలో మానవాళిని ఆధ్యాత్మికతవైపు మళ్లించేందుకు స్వామి నరేంద్రాచార్య మహరాజ్, కనీఫ్ నాథ్ మహరాజ్‌లు రామానందాచార్య బోధనలు ప్రజలకు వివరిస్తూ సమాజహితం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు దిలీప్ గాయక్వాడ్, బాలాజీ, పండరి చాప్లె, నరక్షక్, తదితరులు పాల్గొన్నారు.

జెండా పండుగ ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పెద్దల సంతోష్

బెజ్జూర్: భీమన్న దేవార జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు పెద్దల సంతోష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. ఆదివాసీ భీమన్న దేవార జెండాలు మండలంలోని అన్ని గ్రామాల్లో పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ కొలవార్ జాతీయ అధ్యక్షుడు సుంకే కిష్టయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆదేశాల మేరకు ఈనెల 8న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, మండలాలు, గ్రామ గ్రామాన 23వ భీమన్న దేవార జెండా ఆవిష్కరణ చేయాలన్నారు. ఆదివాసీ కొలవార్ ఆడపడుచు లక్ష్మి దేవారను ఊరేగించిన అనంతరం ఆటపాట చేయాలని, మన సంస్కృతి, సాంప్రదాయాలు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమావేశంలో ఆత్రం భిక్కయ, ఇంజిరి రాజారాం, మనేపెల్లి మల్లేశ్, మనేపెల్లి వెంకటేశ్, మనేపెల్లి గణేష్, సంద్ర మల్లేష్, కొడప శంకర్, ఆత్రం సకారాం, తిరుపతి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో వారసంత కావడంతో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపించడంతోనే ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

హామీలు నెరవేర్చాలి



జెండా పండుగలో పాల్గొన్న ముదిరాజ్‌లు

తలమడుగు: బీసీ డిక్లరేషన్‌తో పాటు ముదిరాజ్‌లను బీసీ(డీ) నుంచి బీసీ(ఏ)లోకి మారుస్తానని ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొజ్జ నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో ముదిరాజ్‌ల జెండా పండుగ నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంత్రివర్గంలో స్థానం నీలం మధు ముదిరాజ్‌కు ప్రభుత్వంలో ప్రత్యేక గుర్తింపు ఎమ్మెల్సీ, ఇతర పదవులు ఇవ్వాలన్నారు. నాయకులు మోతే శ్రీనివాస్, బైండ్ల రామన్న, బైండ్ల సుభాష్, గోనెల గంగన్న, బొజ్జ మోహన్, రమాకాంత్, బొజ్జ మచ్చేందర్, ఎలవేణి కృష్ణ, దర్శనాల నర్సిహులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం పరామర్శించారు. కుచులాపూర్ గ్రామానికి చెందిన సిరిపురం దాసు మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.

రోడ్డుపైనే మురుగునీరు



రోడ్డుపై నిలిచిన మురుగునీరు

సిర్పూర్(టి): నియోజకవర్గ కేంద్రమైన సిర్పూర్(టి)లో మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. ప్రధాన రహదారులతో పాటు ప్రధాన వ్యాపార సముదాయాల వద్ద డ్రెయినేజీలు లేక రోడ్డుపై పారుతుంది. ఎస్టీకాలనీ నుంచి గొల్లవాడ, బెస్తకాలనీ, ఎస్సీ కాలనీ, బస్టాండ్, పేట్ మహెలా ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల గుండా వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వ్యాపార సముదాయాలు, హోటళ్లు, చికెన్ సెంటర్ల నుంచి వచ్చే మురికి నీరు రోడ్డుపైకి వస్తుంది. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌టీఏ నాన్ అఫీషియల్ సభ్యుడిగా రమేశ్



సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

రెబ్బెన: మండలంలోని సింగల్‌గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్‌ను ఆర్‌టీఏ నాన్ అఫీషియల్ సభ్యుడిగా నామినేట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆదివారం జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ కష్టకాలం నుంచి పనిచేసిన ప్రతిఒక్కరికి అధిష్టానం గుర్తింపు ఇస్తుందన్నారు. పార్టీని వీడకుండా మొక్కవోని ఆత్మస్థైర్యంతో పనిచేసిన లావుడ్య రమేశ్‌ను జిల్లా ఆర్‌టీఏ నాన్ అఫీషియల్ సభ్యుడిగా నామినేట్ చేయడం సంతోషకరమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుకు రమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవాజీ, పూదరి హరీష్, సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, రవీందర్‌పాల్గొన్నారు.

నాగోబా విద్యార్థి నిలయం ఏర్పాటు అభినందనీయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: వనవాసీ కల్యాణాశ్రమం ఆధ్వర్యంలో నాగోబా విద్యార్థి నిలయం ఏర్పాటు అభినందనీయమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నాగోబా విద్యార్థి నిలయంలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమానికి అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నాగోబా విద్యార్థి నిలయంలో చదువుతున్న నిరుపేద విద్యార్థులపై విద్యార్థి నిలయం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ చూపి వారు ఉన్నతస్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. చుట్టూ ప్రహరీ లేదని, సమస్యలను పరిష్కరించాలని కమిటీ సభ్యులు ఎంపీ గోడం నగేశ్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అఖిల భారతీయ ఉపాధ్యక్షుడు హెరేకుమ్ర నాగు, జిల్లా సార్‌మెడి మెస్రం దుర్గు, నాగోబా నిలయం అధ్యక్షుడు డొంగ్రె మారుతి పటేల్, ఉపాధ్యక్షుడు మెస్రం జంగు, తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



సన్మానిస్తున్న ఇందిరానగర్ గ్రామస్తులు

రెబ్బెన: తరతరాలుగా వస్తున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని ఆదివాసీ కోలావార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఇందిరానగర్, నక్కలగూడ గ్రామాల్లో గ్రామకమిటీలతో పాటు యువజన సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆడవినే నమ్ముకుని ఆదివాసీలు జీవిస్తారని ప్రకృతినే దేవతగా కొలిచే సంస్కృతి ఆదివాసులదన్నారు. కోలావార్ల ఆరాధ్య దైవమైన భీమదేవర 23వ జెండా పండుగను అన్ని గ్రామాల్లో ఈనెల 8న ఘనంగా జరుపుకోవాలన్నారు. ప్రతీ ఆదివాసీ గ్రామంలో భీమదేవర జెండాలను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, విలాస్, మైలారపు శ్రీనివాస్, బుర్స పోషమల్లు, దుర్గం తిరుపతి, వనిత, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నిర్వహణపై ఆలయ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు

బేల: మండలంలోని సదల్‌పూర్ బైరందేవ్, మహాదేవ్ ఆలయాల ప్రాంగణంలో జంగి జాతర నిర్వహణపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలపై, దుకాణాల ఏర్పాటు ప్రాంగణం శుభ్రతపై చర్చించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు మాట్లాడుతూ.. ఈనెల 23న ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలతో జాతర ప్రారంభమవుతుందన్నారు. 29న కాలదహి హండీ కార్యక్రమంతో జాతర ముగింపు ఉంటుందని తెలిపారు. 27న ఆదివాసీ దర్బార్ సభ, 26 నుంచి కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల వారు, ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు రవాణా, జాతరలో విద్యుత్, నీటి వసతి కల్పిస్తామన్నారు. 15మంది యువకులతో వలంటీర్‌లతో సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌రావు, గౌరవ అధ్యక్షుడు కొరంగే దౌలత్ పటేల్, మాజీ ఎంపీటీసీ కొడపే అరుణ్, పెందుర్ రాందాస్, మెస్రం వాసుదేవ్, సలాం దేవ్‌రావు, నైతం సీతరాం, కొరంగే జంగ్షా, జనార్దన్ పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో బుగ్గారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసకాకుండా క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, రాథోడ్ సురేందర్, పాండు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి

అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని వడూర్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులు నిర్వహించిన వనదర్శిని కార్యక్రమానికి హాజరయ్యారు. ముందుగా అటవీ శాఖ అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం హరితవనంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. గ్రాస్ ల్యాండ్‌లో పీటి (నీటికుంట)ను కాలినడకన అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. సఫారీలో తిరుగుతూ సోలార్ బోర్‌వెల్‌తో పాటు అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం పార్డి గ్రామానికి చెందిన చిరుతపులి దాడిలో గాయపడ్డ చందర్ మహరాజ్‌కు పరిహారంగా రూ.31వేలు అందజేశారు. కార్యక్రమంలో నేరడిగొండ, బోథ్ ఎఫ్ఆర్‌వోలు గణేష్, ప్రణయ్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, అంబేకర్ పండరి, ఆదుముల్ల భూషన్, ఫయ్యాజ్, పాండు, రాథోడ్ సురేందర్, ఉప్పు పోశెట్టి పాల్గొన్నారు.

ఖేల్ కూద్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకట రమణ

బజార్‌హత్నూర్: శ్రీ సరస్వతీ విద్యాపీఠము బైంసా సుభద్ర వాటిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆదిలాబాద్ విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీల్లో బజార్‌హత్నూర్ శ్రీ సరస్వతీ పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. ఖోఖో బాలికల విభాగంలో ప్రథమ, ఖోఖో బాలురు విభాగంలో ద్వితీయ, కబడ్డీ బాలురు విభాగంలో ప్రథమ, కబడ్డీ బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి పొందారు. 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ దొంతుల యశ్వంత్, 400 మీటర్ల పరుగు పందెంలో పద్వాల్ హారతి ద్వితీయ, 200 మీటర్ల పరుగు పందెంలో కొంగర్ల చైతన్య ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో క్యాతం అక్షిత ద్వితీయ, హైజంపులో కొంగర్ల చైతన్య ప్రథమ బహుమతులు గెలుపొందారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వొర్ని వెంకట రమణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వెజ్ బిర్యానీలో చికెన్ ముక్క

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రాజీవ్‌గాంధీ చౌక్‌లో గల స్వాగత్ హోటల్‌లో వెజిటబుల్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చిన వినియోగదారులకు చుక్కెదురైంది. వెజిటబుల్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చిన వారికి సూప్‌లో చికెన్ ముక్క దర్శనమిచ్చింది. ఈ విషయాన్ని హోటల్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా వారు ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని సమాధానం ఇచ్చారని కస్టమర్లు వాపోయారు. ఇదే విషయమై హోటల్ యజమాని శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. తమ సిబ్బంది నిర్లక్ష్యంతో వెజ్ సూప్‌కు బదులుగా నాన్‌వెజ్ సూప్ ఇచ్చారని, అందులో చికెన్ ముక్క ఉన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు.